
సాక్షి తూర్పుగోదావరి
శుక్రవారం । 21 । జూలై । 2023



## దొంగ డాక్టర్‌కు పోలీసు వైద్యం!

డాక్టర్ అవతారం ఎత్తిన ఓ రౌడీషీటర్ వృద్ధులను లక్ష్యంగా చేసుకొని చోరీలకు తెగబడి ఎట్టకేలకు పోలీసులకు దొరికిపోయాడు. - 8లో▸



## డెల్టాలకు నీరు

ధవళేశ్వరం: బ్యారేజి నుంచి గురువారం తూర్పుడెల్టాకు 4000, మధ్య డెల్టాకు 2600, పశ్చిమ డెల్టాకు 4500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

## డిజిటల్ బడులు చూడు.. వీటి స్టైలే వేరు!



ప్రభుత్వ పాఠశాలల్లో చాక్‌పీస్‌లకు కాలం చెల్లుతోంది. చాక్‌పీస్, బ్లాక్ బోర్డులు అవసరం లేని డిజిటల్ బోధన అందుబాటులోకి వచ్చింది. విద్యార్థులకు ఇప్పటివరకూ తరగతి గదిలో ఉపాధ్యాయులు బ్లాక్, గ్రీన్ బోర్డులపై చాక్‌పీస్‌లతో బోధించేవారు. - 8లో▸

## న్యూస్‌రీల్

### రోజంతా చిరుజల్లులు

కొవ్వూరు: జిల్లా వ్యాప్తంగా గడిచిన ఒక మోస్తరు వర్షం కురిసింది. గురువారం ఉదయం ఎనిమిది గంటల వరకూ(గడిచిన ఇరవై నాలుగు గంటల వ్యవధిలో) సగటున 11.3 మి.మీటర్లు వర్షపాతం నమోదైంది. ఉదయం నుంచి తెరిపి లేకుండా చినుకులు పడుతూనే ఉన్నాయి. తాళ్లపూడి లో గరిష్ఠంగా 22.4, సీతానగరంలో 20.4, గోకవరంలో 9.8, కోరుకొండలో 21.4,రాజమహేంద్రవరం అర్బన్‌లో 6.2,రాజమహేంద్రవరం రూరల్‌లో 4.8, రాజానగరంలో 12.2, రంగంపేటలో 4.6, బిక్కవోలులో 1.8,అనపర్తిలో 3.6, కడియంలో 6.8,తాళ్లపూడిలో 13.4, గోపాలపురంలో14.4, నల్లజర్లలో 19.4, దేవరపల్లిలో 10.0, కొవ్వూరులో 10.6, చాగల్లులో 5.0, నిడదవోలులో 22.4, ఉండ్రాజవరంలో 17.8, పెరవలిలో9.8 మి.మీటర్ల చొప్పున వర్షం కురిసింది.ఉదయం నుంచి వర్షం కురుస్తుండడం జనం ఇళ్లకే పరిమితయ్యారు.

### ఏడాదికి నాలుగు సార్లు ఓటరు నమోదు



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ నెలల్లోని ఒకటో తేదీన ఓటరు నమోదుకు అవకాశం ఉందని జిల్లా ఎన్నికల ఓటరు నమోదు అధికారి, కలెక్టర్ మాధవీలత తెలిపారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలతో గుర్తించబడిన బూత్‌స్థాయి సహాయకులు బీఎల్‌వోలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటరు ధృవీకరణ ప్రక్రియలో పాలుపంచుకోవాలన్నారు. నియోజకవర్గ స్థాయిలో ప్రతి మంగళవారం, జిల్లాస్థాయిలో ప్రతి బుధవారం రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహిస్తామని, ఆ మేరకు పూర్తిస్థాయిలో సహకారం అందించి ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జిల్లాలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటుహక్కు కలిగేలా అవగాహన కల్పించడానికి రాజకీయ పార్టీలు ముందుకు రావాలని కోరారు. గతంలో ఏటా రెండు సార్లు ఓటరు నమోదు చేసేవారని, ఇప్పుడు నాలుగు సార్లు అవకాశం ఉందన్నారు. సమావేశంలో జేసీ తేజ్ భరత్, జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహం, వైఎస్సార్ సీపీ ప్రతినిధి యూపీ వర్మ, టీడీపీ ప్రతినిధి ఏ.జగదీష్, కాంగ్రెస్ ప్రతినిధి డాక్టర్ వైఏ వడయార్ తదితరులు పాల్గొన్నారు.

### సీజ్ చేసిన బియ్యానికి 31న వేలం

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో సీజ్ చేసిన 1318.39 క్వింటాళ్ల బియ్యానికి ఈనెల 31వ తేదీన వేలం నిర్వహిస్తున్నట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ తెలిపారు. జిల్లాలోని రైస్‌మిల్లర్లు, బియ్యం దుకాణాలు, కిరాణా షాపులు యజమానులు వేలంలో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తిక లవారు ముందుగా రూ.20 వేల డిమాండ్ డ్రాఫ్టును జాయింట్ కలెక్టర్, తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం పేరున చెల్లించాలన్నారు. ఈనెల 31వ తేదీ మధ్యాహ్నం 2గంటల లోపు బియ్యం నమూనాలను పరిశీలించుకోవాలన్నారు. 31వ తేదీ సాయంత్రం 6 గంటలకు వేలం నిర్వహిస్తామన్నారు. పాల్గొనేవారిపై ఏవిధమైన క్రిమినల్, 6 ఏ కేసులు నమోదు కాకూడదన్నారు.

# వరదడ



పోటెత్తుతున్న వరద

- ఎగువ ప్రాంతాల వర్షాలతో గోదావరికి వరద తాకిడి
- కాటన్ బ్యారేజీ వద్ద పెరుగుతున్న నీటిమట్టం
- నేడు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ?
- అప్రమత్తమైన జిల్లా అధికార యంత్రాంగం

సాక్షి, రాజమహేంద్రవరం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరికి వరద తాకిడి జోరందుకుంది. తక్కువ వ్యవధిలోనే వరద ఉధృతి పెరుగుతోంది. మరోపక్క భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం అంతకంతకూ పెరుగుతోంది. గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో నీటిమట్టం 43.50 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. అక్కడ 9.32,228 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 48 అడుగులకు చేరితే మొదటి రెండో హెచ్చరిక జారీ చేస్తారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు పడుతున్న నేపథ్యంలో నీటి ప్రవాహం మరింతగా పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

**వరద పరవళ్లు**

కాటన్ బ్యారేజీ వద్ద 1986లో అత్యధికంగా 55.66 మీటర్లకు నీటి మట్టం చేరినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. భద్రాచలం వద్ద వరద నీటి ప్రవాహం పెరిగిన కారణంగా ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వరద నీటితో తొణికిసలాడుతోంది. రాత్రి 11 గంటల సమయానికి బ్యారేజీలో నీటిమట్టం 9.70 అడుగులకు చేరింది. 175 గేట్లు ఎత్తి 7,10,448 క్యూసెక్కుల మిగులు జలాలు సముద్రంలోకి విడుదల చేశారు. 11,100 క్యూసెక్కులు కాలువలకు విడుదల చేశారు. వరద పెరుగుతున్న దృష్ట్యా శుక్రవారం ఉదయానికి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. ఇక్కడ నీటి మట్టం 11.75 అడుగులకు చేరితే మొదటి హెచ్చరిక అమల్లోకి వస్తుంది. 13.75 అడుగుల వద్ద రెండు, 17.75 అడుగుల వద్ద మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు.

**నదీ తీర ప్రాంతాలు కళకళ**

గోదావరి వరద ప్రభావంతో గోదావరి తీర ప్రాంతాలు నీటితో కళకళలాడుతున్నాయి. రాజమహేంద్రవరంలోని పుష్కర్ ఘాట్, కోటిలింగాల రేవు, గౌతమ ఘాట్‌లకు నీరు తాకింది. మెట్ల వరకూ చేరడంతో పుష్కర ఘాట్ వద్ద పుణ్యస్నానాలు ఆచరించేందుకు అనుమతులు నిరాకరించారు. కొవ్వూరు గోష్పాద క్షేత్రం మెట్ల వరకు నీరు చేరింది. శుక్రవారం మరింత ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

**రేవుల వద్ద ముందస్తు జాగ్రత్తలు**

అధిక వర్షాల కారణంగా గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్న దృష్ట్యా తాళ్లపూడి, కొవ్వూరు, నిడదవోలు, పెరవలి మండలాల్లోని గోదావరి పరీవాహక గ్రామాల్లో పశువులు, స్నానాల రేవుల వద్ద ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. రేవులు, స్నానఘట్టాల వద్ద బారికేడింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ఫ్లాష్ లైట్లు అమర్చుతున్నారు. గోదావరి నదిలోకి దిగకూడదన్న ప్రమాద హెచ్చరిక బోర్డులు పెడుతున్నట్లు తెలిపారు.

**అధికారులు అప్రమత్తం**

జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కంట్రోల్ రూములను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ప్రకటించారు. సహాయక చర్యలు ముమ్మరం చేసేందుకు సన్నద్ధమయ్యారు. జిల్లా, డివిజనల్ స్థాయిలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. 24 గంటలూ అందుబాటులో ఉండేలా షిఫ్టల వారీగా సిబ్బందికి విధులు కేటాయించారు. సహాయక చర్యలకు ఎలాంటి సమయంలోనైనా సంప్రదించవచ్చని ఆమె తెలిపారు. గోదావరి పరీవాహక గ్రామాలు, లంక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు కంట్రోలు రూములను వినియోగించుకుని సమాచారం పొందాలని సూచించారు.

**జిల్లాలో విస్తారంగా వర్షం**

అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షం విస్తారంగా కురుస్తోంది. మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానతో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. సగటున 214.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా నిడదవోలులో 22.4 మిల్లీమీటర్లు, అత్యల్పంగా బిక్కవోలు 1.8గా నమోదైంది. అనపర్తిలో 3.6 మిల్లీమీటర్లు నమోదైంది. సీతానగరంలో 20.4, గోకవరం 9.8, కోరుకొండ 21.4, రాజమహేంద్రవరం అర్బన్ 6.2, రాజమహేంద్రవరం రూరల్ 4.8, రాజానగరం 12.2, రంగంపేట 3.6, కడియం 6.8, తాళ్లపూడి 13.4, గోపాలపురం 14.4, నల్లజర్ల 19.4, దేవరపల్లి 10.0, కొవ్వూరు 10.6, చాగల్లు 5.0, ఉండ్రాజవరం 17.8, పెరవలిలో 9.8 మిల్లీమీటర్లుగా నమోదైంది.

### కంట్రోల్ రూముల నంబర్లు

జిల్లా కలెక్టర్ కార్యాలయం : 8977935609

రాజమహేంద్రవరం ఆర్డీఓ కార్యాలయం : 0883-2442344

కొవ్వూరు ఆర్డీఓ కార్యాలయం : 9440295493

### కాటన్ బ్యారేజీ వద్ద గురువారం నీటి మట్టం ఇలా

| సమయం | నీటిమట్టం (అడుగుల్లో) | దిగువకు విడుదల (క్యూసెక్కుల్లో) |
|---|---|---|
| మధ్యాహ్నం 2 గంటలు | 7.90 | 4,81,466 |
| మధ్యాహ్నం 3 గంటలు | 8.20 | 5,18,241 |
| సాయంత్రం 5 గంటలు | 8.70 | 5,68,174 |
| సాయంత్రం 6 గంటలు | 8.80 | 5,83,339 |
| రాత్రి 10 గంటలు | 9.60 | 6,94,226 |
| రాత్రి 11 గంటలు | 9.70 | 7,10,448 |



నీటి మట్టం సూచిక



పుష్కర ఘాట్ వద్ద వరద ప్రవాహం

## నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి

పోలవరం స్పెషల్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య



నిర్వాసిత ప్రతినిధులతో మాట్లాడుతున్న పోలవరం స్పెషల్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య

ధవళేశ్వరం: పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పోలవరం స్పెషల్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య తెలిపారు. ధవళేశ్వరంలోని పోలవరం ప్రాజెక్టు కార్యాలయంలో గురువారం నిర్వాసిత ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. విలీన మండలాల నిర్వాసితుల ప్రతినిధులు తమ సమస్యలను ఆయనకు వివరించారు. దీనిపై స్పెషల్ కలెక్టర్ స్పందిస్తూ ప్రతి శుక్రవారం జరిగే అభివృద్ధి కమిటీ సమావేశాల్లో అధికారుల దృష్టికి ఈ సమస్యలను తీసుకెళ్లాలని సూచించారు. మ్యుటేషన్ అయిన భూములకు సచివాలయంలో దరఖాస్తు చేసుకొని పట్టాదారు పాసు పుస్తకాలను పొందాలన్నారు. అర్హత ఉండి పునరావాసం, ప్యాకేజీ అందని నిర్వాసితులు తనను నేరుగా కలవచ్చునన్నారు. ప్రతి సోమవారం ధవళేశ్వరంలోని కార్యాలయంలో అందుబాటులో ఉంటానని తెలిపారు. కాంటూరు లెక్కలను మరోసారి రీ సర్వే చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. తాజా వరదల నేపథ్యంలో నిర్వాసితులకు భరోసా కల్పించాలని కోరారు. ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లింపునకు నోటిఫికేషన్ తేదీకి బదులుగా గ్రామాన్ని ఖాళీ చేసే తేదీని పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ పునరావాస కాలనీలలో మౌలిక వసతులను కల్పించాలన్నారు. 41వ కాంటూరు పరిధిలో ప్రభావిత గ్రామాలన్నింటికీ దశల వారీగా పునరావాసం, ప్యాకేజీ అందిస్తున్నట్లు ప్రవీణ్ వెల్లడించినట్లు నిర్వాసిత ప్రతినిధులు తెలిపారు. తాజాగా 2,344 మందికి త్వరలో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ జమ అవుతుందని పేర్కొన్నారన్నారు. లైడార్ సర్వే ద్వారా మరో 36 గ్రామాలు చేరుస్తామన్నారన్నారు. పునరావాస కాలనీల సమస్యలను ఆయనకు వివరించామన్నారు.

## సీఎం జగన్ పర్యటన ఏర్పాట్లపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి విశ్వరూప్. వేదికపై కలెక్టర్ హిమాన్షు శుక్లా, డీఆర్‌ఓ సత్తిబాబు

- 26న అమలాపురం రానున్న ముఖ్యమంత్రి
- డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ రాయితీ సొమ్ము జమ

అమలాపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 26వ తేదీన కోనసీమ జిల్లా కేంద్రం మైన అమలాపురం రానున్న నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్లను రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్ గురువారం సమీక్షించారు. కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించిన ఆయన స్వయం సహాయ సంఘాలకు సున్నా వడ్డీ రాయితీ నిధులు బటన్ నొక్కి జమ చేసే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆదేశించారు. అధికారులకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. సభాస్థలికి అమలాపురం చుట్టు పక్కల మండలాల పరిధిలోని మహిళలు వచ్చే అవకాశం ఉందని దూర ప్రాంతాల నుంచి వచ్చే మహిళలకు అల్పాహారం, భోజనం వసతిని సంబంధిత ఎంపీడీవోల సమన్వయంతో కల్పించాలని అధికారులకు సూచించారు. హెలిప్యాడ్ నిర్వహణను, అప్రోచ్ రహదారుల నిర్మాణాన్ని రహదారులు భవనాలశాఖ చేపట్టాలని సూచించారు. స్థానికంగా పురపాలక సంఘ కమిషనర్ రోడ్ల మరమ్మతులు చేపట్టాలని సూచించారు. వేదిక, గ్యాలరీల ఏర్పాటు పక్కాగా ఉండాలని చెప్పారు. పోలీస్ యంత్రాంగం ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ జామ్‌కు ఆస్కారం లేకుండా వాహనాల పార్కింగ్‌కు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా, డీఆర్‌ఓ సీహెచ్ సత్తిబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, మున్సిపల్ కమిషనర్ వీవీపీ నాయుడు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## పశుసంచార వైద్యాన్ని వినియోగించుకోవాలి

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): పశువుల వైద్య చికిత్సల కోసం 1962 టోల్ ఫ్రీనంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్టు కలెక్టర్ మాధవీలత తెలిపారు. వెలగపూడి నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి గురువారం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, రీసర్వే, భూసేకరణ, వ్యవసాయం, జగనన్న పాలవెల్లువ, హౌసింగ్, ప్రాధాన్యతా భవనాలు, ఎన్‌ఆర్‌ఈజీఎస్, జేకేసీ ద్వారా చేపట్టి అమలు చేస్తున్న లక్ష్యాల పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

కలెక్టరేట్ నుంచి కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ రైతులు, పశుపోషకులు పశు సంచార వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జిల్లాలోని గర్భిణుల్లో రక్తహీనత నివారణ కోసం వైఎస్సార్ సంపూర్ణ పోషకాహారాన్ని అందిస్తున్నామన్నారు. రీసర్వేలో భాగంగా 51 గ్రామాలకు గాను 14 పూర్తి చేశామన్నారు.

## పొత్తుల కోసం టీడీపీ వెంపర్లాట

- ప్రతిపక్షాలకు ఓటమి భయం
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: గతంలో జోలె పట్టినా అందని సంక్షేమ పథకాలను.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జల్లెడతో గాలించి లబ్ధిదారులకు అందిస్తున్నామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో మండలంలోని రఘుదేవపురంలో గురువారం జరిగిన జగనన్న సురక్ష గ్రామసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జనసేనతో పాటు వివిధ పార్టీలతో పొత్తు కోసం తెలుగుదేశం పార్టీ వెంపర్లాడుతోందన్నారు. ఓటమి ఖాయమని భావించిన ప్రతిపక్షాలు కూటమిగా రావడానికి ప్రయత్నిస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి జగన్ ప్రభంజనంలో ఆ పార్టీలన్నీ కొట్టుకుపోతాయన్నారు. మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభంజనం సృష్టించి, జగన్ రాష్ట్ర ప్రజలకు పారదర్శక పాలన అందిస్తారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు, లోకేష్, కేబినెట్ మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు మాత్రమే అభివృద్ధి చెందారన్నారు. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక సమాజంలో అట్టడుగున ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు.రాష్ట్రంలో 84 శాతం మందికి తెలుపు రేషన్ కార్డులు ఉన్నాయన్నారు. 93 శాతం ప్రజలు వివిధ పథకాల ద్వారా లబ్ధిపొందుతున్నారన్నారు. గతంలో 42 లక్షల మందికి పెన్షన్లు ఇస్తే, తమ ప్రభుత్వం 72 లక్షల మందికి అందిస్తోందన్నారు.



రఘుదేవపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

**ఒక్కరోజులో 6.87 లక్షల సర్టిఫికెట్లు**

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో ఈనెల 18వ తేదీన రాష్ట్రంలో 6,87,863 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు ఇచ్చిన ఘనత జగనన్న ప్రభుత్వానిదేనన్నారు. సర్టిఫికెట్ల మంజూరులో మనజిల్లా రాష్ట్రంలో రెండోస్థానంలో ఉందన్నారు. ఇందుకు సహకరించిన కలెక్టర్, వివిధ శాఖల అధికారులకు అభినందనలు తెలిపారు. జగనన్న సురక్షలో జిల్లాలో 4,84,305 ఇళ్లను సర్వే చేశారని, 3,64,634 సర్టిఫికెట్లకు దరఖాస్తులు వస్తే, 3,60,496 (99 శాతం) మందికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కోకన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి అంబటి రమణ, సర్పంచ్ ఇంగుడుమిల్లి చంద్రలీల, పార్టీ నాయకులు గెద్దాడ త్రిమూర్తులు పాల్గొన్నారు.

# నేతన్న నేస్తం.. జగన్ ప్రభుత్వం

- చేనేత రంగానికి వెలుగులు
- నేడు వైఎస్సార్ నేతన్న నేస్తం ఐదో విడత నిధుల విడుదల
- ప్రతి కార్మికుడికీ రూ.24 వేలు జమ
- జిల్లాలో 916 మందికి లబ్ధి

రాజమహేంద్రవరం రూరల్: చేనేత రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఊపిరి పోస్తున్నారు. సొంత మగ్గం ఏర్పాటు చేసుకుని స్వయంగా చేనేత వస్త్రాలు నేసి బహిరంగ మార్కెట్‌లో అమ్ముకుని ఆర్థికంగా నిలబడేందుకు ప్రతి కార్మికుడికీ వైఎస్సార్ నేతన్న నేస్తం ద్వారా ఏటా రూ.24 వేలు అందిస్తున్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా చేనేతలకు అండగా నిలబడ్డారు. చేనేత రుణ బకాయిలు రూ.300 కోట్లు మాఫీ చేశారు. నిర్వీర్యమైన ఆప్కోకు నిధులు కేటాయించి బలోపేతం చేశారు. నూలు, రంగు, రసాయనాలపై 10 శాతం సబ్సిడీని ప్రకటించారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి అప్పటి వరకూ నూలుపై ఉన్న 9.2 శాతం ఎక్సైజ్ డ్యూటీని రద్దు చేయించారు.

**నేతన్నకు నేనున్నానంటూ..**

సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టగానే చేనేత కార్మికుల కోసం వైఎస్సార్ నేతన్న నేస్తం పథకాన్ని ప్రవేశపెట్టారు. మగ్గం ఉన్న ప్రతి కార్మికుడికీ ఏటా రూ.24 వేలు చొప్పున నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నారు. ఇప్పటికే నాలుగు విడతలుగా నగదు జమ చేశారు. వైఎస్సార్ నేతన్న పథకం ఐదో విడత పంపిణీని శుక్రవారం చేయనున్నారు. జిల్లాలోని 916 మంది నేత కార్మికులకు రూ.2,19,84,000 లబ్ధి చేకూరనుంది. గతంలో సహకార రంగం (సొసైటీ)లో ఉన్న కార్మికులకు మాత్రమే ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అందేవి. అయితే నేతన్న నేస్తం ద్వారా మగ్గం ఉన్న ప్రతి కార్మికుడికీ ఆర్థిక సాయం అందుతోంది.

### నేతన్న నేస్తం లబ్ధి ఇలా...

| సంవత్సరం | లబ్ధిదారులు | మొత్తం లబ్ధి (రూ.లలో) |
|---|---|---|
| 2019-20 | 759 | 1,82,16,000 |
| 2020-21 | 881 | 2,11,44,000 |
| 2021-22 | 819 | 1,96,56,000 |
| 2022-23 | 883 | 2,11,92,000 |
| 2023-24 | 916 | 2,19,84,000 |



**ఆప్కో ద్వారా కొనుగోళ్లు**

మగ్గంపై నేసిన వస్త్రాల కొనుగోలుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆప్కోకు నిధులు కేటాయించి దాని ద్వారా వస్త్రాలను కొనుగోలు చేయిస్తున్నారు. ఇవి కాకుండా ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యాదీవెన, అమ్మ ఒడి, వసతి దీవెన, వైఎస్సార్ చేయూత, ఆసరా తదితర పథకాలు చేనేత కార్మికులకు అందుతున్నాయి.

### జగనన్న సాయం భేష్



వ్యవసాయం తర్వాత రెండో రంగం చేనేత. దీని అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకోవడం అభినందనీయం. వైఎస్సార్ నేతన్న నేస్తం పథకంలో బాగంగా ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ.24 వేలు అందించడంతో పాటుగా ఆప్కో ద్వారా చేనేత వస్త్రాల అమ్మకాలు చేస్తున్నారు. రంగులు, రసాయనాలపై పన్నులు తగ్గించారు. **– బత్తుల సురేష్, చేనేత కార్మికుడు, మురమండ**

### జీవితాల్లో వెలుగు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మా సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టారు. నేతన్నలు వృత్తిలో రాణించేందుకు వైఎస్సార్ నేతన్న నేస్తం పథకాన్ని రూపొందించి ఏడాదికి రూ.24 వేలు అందించడం అభినందనీయం. సీఎం జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం. ఆయన వల్లే మా జీవితాల్లో వెలుగు వచ్చింది. **– గంపల వీరభద్రరావు, చేనేత కార్మికుడు, కాతేరు**

## క్లుప్తంగా

### బైపీసీ అభ్యర్థులను అనుమతించాలని లేఖ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఏపీఈఏపీ సెట్ ద్వారా నిర్వహించే వెబ్ కౌన్సెలింగ్‌లో బైపీసీ అభ్యర్థులకు ఫుడ్ ఇంజినీరింగ్ కోర్సులో ప్రవేశాలకు అనుమతి ఇవ్వాలని జేఎన్‌టీయూ కాకినాడ ఉన్నత విద్యామండలికి లేఖ రాసింది. ఈ కోర్సులో ప్రవేశాలకు కేవలం ఎంపీసీ విద్యార్థులకు మాత్రమే ఇప్పటి వరకూ అవకాశం ఉండగా ఈ ఏడాది నిర్వహించే ప్రవేశాల్లో బైపీసీ అభ్యర్థులకు అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిపై ఉన్నత విద్యామండలి కార్యాలయం ఈఏపీ సెట్ అడ్మిషన్ల కన్వీనర్ నాగరాణికి వివరాలు అందజేశారు.

### చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

రూ.28,500 రికవరీ

అమలాపురం టౌన్: ముమ్మిడివరం మండలం అనాతవరంలో జరిగిన చోరీ కేసులో నిందితుడు నాతి బాలకృష్ణను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ.28,500 నగదు, ఒక సెల్‌ఫోన్ రికవరీ చేసినట్లు అమలాపురం డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14న అనాతవరంలో జి.రాజు ఇంట్లో ఈ చోరీ జరిగింది. ఆ ఇంటి తలుపు గొళ్లెం విరగ్గొట్టి ఇంట్లో రూ.30 వేల నగదు, సెల్‌ఫోన్ దొంగిలించారన్నది అభియోగం. ముమ్మిడివరం ఎస్సై సురేష్‌బాబు నిర్వహించిన దర్యాప్తులో ఈ చోరీ కపిలేశ్వరపురం మండలం అద్దంకివారిలంక గ్రామానికి చెందిన నాతి బాలకృష్ణ చేశాడని తేలింది. నిందితుడు బాలకృష్ణను అరెస్ట్ చేసి ముమ్మిడివరం జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరు పరచగా 14 రోజులు జ్యుడీషియల్ రిమాండ్ విధించి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్లు డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపారు. ఈ కేసును ముమ్మిడివరం సీఐ ఎస్.కొండయ్య పర్యవేక్షణలో ఎస్సై కె.సురేష్‌బాబు దర్యాప్తు చేస్తున్నారు.

### రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

నిడదవోలు : స్థానిక రైల్వే స్టేషన్ యార్డు అప్‌లైన్ ట్రాక్ వద్ద గురువారం విజయవాడ–విశాఖ వైపు వెళుతున్న గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో సుమారు 50 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు నలుపు రంగు ఫ్యాంట్ ధరించాడు. తాడేపల్లిగూడెం జీఆర్‌పీ ఎస్సై జి.శ్రీహరిబాబు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని వివరాలు తెలిసినవారు 9490617090 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని జీఆర్‌పీ పోలీసులు తెలిపారు.

# డిజిటల్ బడులు చూడు.. వీటి స్టైలే వేరు!

- బోధనలో సరికొత్త విధానానికి శ్రీకారం
- ప్రైమరీలో స్మార్ట్ టీవీలు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఐఎఫ్‌పీల ద్వారా
- ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ తరగతులు


ఐఎఫ్‌పీల ద్వారా డిజిటల్ విద్యను నేర్చుకుంటున్న విద్యార్థులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ)/రాయవరం: ప్రభుత్వ పాఠశాలల్లో చాక్‌పీస్‌లకు కాలం చెల్లుతోంది. చాక్‌పీస్, బ్లాక్ బోర్డులు అవసరం లేని డిజిటల్ బోధన అందుబాటులోకి వచ్చింది. విద్యార్థులకు ఇప్పటివరకూ తరగతి గదిలో ఉపాధ్యాయులు బ్లాక్, గ్రీన్ బోర్డులపై చాక్‌పీస్‌లతో బోధించేవారు. బోధనా పద్ధతుల్లో..మౌలిక వసతుల్లో ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలతో పోల్చుకునేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేట్ పాఠశాలలను ప్రభుత్వ పాఠశాలలతో పోల్చుకునే పరిస్థితి వచ్చింది. మన బడి నాడు–నేడు పథకం ద్వారా కార్పొరేట్ పాఠశాలలను తలదన్నే రీతిలో మౌలిక వసతులు కల్పించి, అభివృద్ధి చేశారు. ఇప్పుడు బోధనలోనూ సాంకేతిక విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రైవేట్/కార్పొరేట్ పాఠశాలల్లో లేని విధంగా ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ డిస్‌ప్లే (ఐఎఫ్‌పీడీ)లను ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేశారు. ఈ విధానంతో పాఠశాలల్లో బ్లాక్, గ్రీన్ బోర్డుల ద్వారా బోధనకు స్వస్తి పలుకుతారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీ డిస్‌ప్లేలను వినియోగించే విధానంపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు.

**ఐఎఫ్‌పీ అంటే**

అభివృద్ధి చెందిన దేశాల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ డిస్‌ప్లే ద్వారా ఇప్పటికే బోధన సాగిస్తున్నారు. ఈ విధానాన్ని ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం దేశంలో తొలిసారిగా మన రాష్ట్రంలో అమలు చేస్తోంది. వీటి ద్వారా ఎంత క్లిష్టమైన పాఠ్యాంశాన్నైనా సులువుగా బోధించవచ్చు. ఉపాధ్యాయులు గతంలో ఏదైనా కొత్త విషయాన్ని బోధించాలంటే తమ ఆండ్రాయిడ్ ఫోన్లో ఆ విషయాన్ని డౌన్‌లోడ్ చేసుకుని బోధించాల్సి వచ్చేది. కానీ నూతన విధానంలో ఒక క్లిక్‌తో ఈ ప్యానల్‌పై పాఠ్యాంశాలను బోధించే అవకాశముంటుంది. గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టులు బోధించే సమయంలో ఆయా చిత్రాలను బోర్డుపై గీస్తూ బోధన చేయవచ్చు. వీటిని బ్లాక్, వైట్ బోర్డులుగా ఉపయోగించవచ్చు. ఐఎఫ్‌పీలపై త్రిభుజాలు, చతుర్భుజాలు, మానవ అవయవాలు, వివిధ రకాల పటాలను, చిత్రాలను స్వయంగా గీసి చూపిస్తూ బోధించడం వల్ల విద్యార్థులు సులువుగా అభ్యసించే వీలవుతుంది. ఆయా పాఠ్యాంశాలకు సంబంధించి విద్యార్థులకు వీడియోలను, ఫొటోలను చూపించవచ్చు. ఉపాధ్యాయుడు బోధించిన పాఠాన్ని సేవ్ చేసుకునే ఆప్షన్ కూడా ఉంది. నాన్ లాంగ్వేజెస్ ఉపాధ్యాయులే కాకుండా లాంగ్వేజ్ ఉపాధ్యాయులు తమ సబ్జెక్టులను బోధించే అవకాశముంది. మొబైల్ ఫోన్‌తో కూడా ఐఎఫ్‌పీని ఆపరేట్ చేసుకోవచ్చు. తరగతి గదుల్లో ఉపాధ్యాయుల బోధనను ప్రధానోపాధ్యాయుడి గది నుంచి పర్యవేక్షణ చేసే వీలుంది. 1–5 తరగతులకు స్మార్ట్ టీవీలు, 6–10 తరగతులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ డిస్‌ప్లేలు ఏర్పాటు చేశారు.

**అవగాహన తరగతులు**

డిజిటల్ విద్యా విధానంలో ఐఎఫ్‌పీ డిస్‌ప్లేలు ఏ విధంగా ఉపయోగించాలి? అనే అంశంపై ప్రధానంగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో బోధన చేస్తున్న ఉపాధ్యాయులకు ఐఎఫ్‌పీలతో పాటుగా, స్మార్ట్ టీవీలు, బైజూస్ ట్యాబ్స్ వినియోగంపై కూడా శిక్షణ ఇచ్చారు. ఒక్కో బ్యాచ్‌కు రెండు రోజుల వంతున కాకినాడ జిల్లాలో ఉన్న 4,437 మంది ఉపాధ్యాయులకు జేఎన్‌టీయూకే, ఆదర్శ, ప్రగతి, ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలల్లో తరగతులు నిర్వహించారు.

**కాకినాడ జిల్లాలో పరిస్థితి ఇదీ..**

జిల్లాలో 933 ప్రాథమిక, 105 ప్రాథమికోన్నత, 247 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఉన్నత పాఠశాలల్లో 1,356 ఐఎఫ్‌పీ డిస్‌ప్లేలకు గాను 504 ఏర్పాటు చేయగా, ప్రాథమిక పాఠశాలల్లో 430కు గాను 325 స్మార్ట్ టీవీలను ఆయా పాఠశాలల్లో ఇనస్టాలేషన్‌ను కూడా పూర్తి చేశారు.

**కోనసీమ జిల్లాలో ఇలా..**

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో డిజిటల్ బోధనకు ఈ విద్యా సంవత్సరం నుంచి శ్రీకారం చుట్టారు. తొలి విడతగా నాడు–నేడు పథకంలో అభివృద్ధి చేసిన పాఠశాలల్లో ప్రారంభించారు. 142 పాఠశాలల్లో 951 ఐఎఫ్‌పీలు ఏర్పాటు చేశారు. ఒక్కో ఐఎఫ్‌పీకి రూ.1.20 లక్షలు వెచ్చించారు. 951 ఐఎఫ్‌పీలకు ప్రభుత్వం రూ.11.41 కోట్లను ఖర్చు చేసింది. ఈ నెల 15 నుంచి డిజిటల్ విద్య ద్వారా తరగతుల్లో బోధన చేపట్టారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 3,895 మంది ఉపాధ్యాయులు, సీఆర్పీలు, పార్ట్‌టైమ్ అసిస్టెంట్లకు ఐఎఫ్‌పీల ద్వారా బోధన చేపట్టే అంశాలపై శిక్షణ ఇచ్చారు. గత విద్యా సంవత్సరంలో 17,039 మంది 8వ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్స్‌ను పంపిణీ చేశారు. 14,561 మంది విద్యార్థులకు, 2,478 మంది ఉపాధ్యాయులకు ట్యాబ్స్ అందజేశారు. డిజిటల్ విద్యను విద్యార్థులు ఆసక్తిగా నేర్చుకుంటున్నారు.

**సులభంగా అర్థమవుతున్నాయి**



గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టుల బోధన చాలా బాగుంది. నేర్చుకున్న విషయం ఎప్పటికీ మర్చిపోలేం. టీచర్ బోధనతో పాటు అంశం నేరుగా చూస్తూ నేర్చుకుంటున్నాం. చాలా ఆసక్తిగా ఉంది.
–కె.షర్మిష్ఠ, 9వ తరగతి విద్యార్థిని, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, ముమ్మిడివరం

**టెక్నాలజీతో బోధన బాగుంది**



బోధనకు ఇలా నూతన టెక్నాలజీని అమలు చేస్తారని ఊహించలేదు. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యను అమలు చేయడం వల్ల మరింత సమర్థంగా బోధించడానికి వీలవుతుంది.
– ఎ.మహాలక్ష్మి, స్కూల్ అసిస్టెంట్, జెడ్పీహెచ్ఎస్(బాలికలు), సూర్యనగర్, అమలాపురం

**డిజిటల్ విద్య అద్భుతం**



సీఎం జగన్ ఆలోచన అద్భుతం. డిజిటల్ టెక్నాలజీని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయడం అద్భుతమైన ఆలోచనగా చెప్పవచ్చు. వీటి సాయంతో అత్యుత్తమ విద్యా బోధన చేసేందుకు వీలవుతుంది.
– డాక్టర్ సానబోయిన చంద్రశేఖర్, ఐఎఫ్‌పీ ట్రైనర్, సీఎస్ఈ అసిస్టెంట్ ప్రొఫెసర్, జేఎన్‌టీయూ

**శిక్షణ పూర్తి చేశాం**



భవిష్యత్ అంతా డిజిటల్ టెక్నాలజీపైనే ఆధారపడి ఉంటుంది. ఉపాధ్యాయులు డిజిటల్ టెక్నాలజీని అందిపుచ్చుకునేందుకు వీలుగా శిక్షణ తరగతులను ఏర్పాటు చేశాం. దశలవారీగా అన్ని పాఠశాలల్లో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.
– కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ, డీఈఓ

## నవంబర్ 29, 30 తేదీల్లో అంతర్జాతీయ సెమినార్


సెమినార్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో నవంబర్ 29, 30వ తేదీల్లో సొసైటీ ఫర్ కమ్యూనిటీ రీసెర్చ్ ఇన్ యాక్షన్ (ఎస్‌సీఆర్ఏ) యూఎస్ఏ ఆధ్వర్యంలో అంతర్జాతీయ సెమినార్ జరగనుంది. స్పృహ సైకాలజీ అలూమ్ని అసోసియేషన్, రోటరీ డిస్ట్రిక్ట్ 3020, డిపార్టుమెంట్ ఆఫ్ సైకాలజీ సంయుక్త సహకారంతో గ్లోబల్ పీస్ అండ్ హెల్త్ మ్యాగ్జిమైజేషన్ ఏ కమ్యూనిటీ పెరస్పెక్టివ్ అనే అంశంపై ఈ సెమినార్ నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను వీసీ ఆచార్య కె.పద్మరాజు గురువారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విశ్వశాంతికి, వ్యక్తిగత, సామాజిక, ఆరోగ్య జీవన విధానానికి కమ్యూనిటీ సైకాలజీ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. విద్యావేత్తలు, ఎన్‌జీఓలు, ప్రముఖులు పూర్తి సహకారం అందించి ఈ సెమినార్‌ను విజయవంతం చేయాలన్నారు. సైకాలజీ విభాగాధ్యక్షుడు డాక్టర్ పి.రాజశేఖర్, డాక్టర్ ఎస్‌వీవీఎస్ నారాయణ, డాక్టర్ సీహెచ్ భవాని, సుంకర నాగేంద్ర కిషోర్ పాల్గొన్నారు.

## నేటి నుంచి సబ్ జూనియర్స్ బాస్కెట్ బాల్ పోటీలు


గన్నమని చక్రవర్తి

రామచంద్రపురం: స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో శుక్రవారం నుంచి 23వ తేదీ వరకు ఎనిమిదవ సబ్ జూనియర్స్ బాస్కెట్‌బాల్ అంతర్ జిల్లాల చాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి తెలిపారు. స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు జూనియర్ కళాశాల ప్రాంగణంలో గురువారం ఆయన విలేకరులకు వివరాలను వెల్లడించారు. ఏపీ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను తన తల్లి స్వర్గీయ గన్నమని భానుమతి జ్ఞాపకార్థం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ పోటీల్లో వివిధ జిల్లాలకు చెందిన 12 బాలుర, 9 బాలికల జట్లు తలపడనున్నట్లు చెప్పారు. ఎంపికైన బాల బాలికలు ఆగస్టు రెండవ తేదీ నుంచి పాండిచ్చేరిలో జరిగే సబ్ జూనియర్స్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

# దొంగ డాక్టర్‌కు పోలీసు వైద్యం!

- బయటపడ్డ వరుస చోరీలు
- వృద్ధులే లక్ష్యంగా మూడు నెలల్లో ఎనిమిది దోపిడీలు


విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ క్రైం: డాక్టర్ అవతారం ఎత్తిన ఓ రౌడీషీటర్ వృద్ధులను లక్ష్యంగా చేసుకొని చోరీలకు తెగబడి ఎట్టకేలకు పోలీసులకు దొరికిపోయాడు. సదరు డాక్టర్‌ను తమదైన శైలిలో పోలీసులు ప్రశ్నించడంతో మొత్తం అతను చేసిన దొంగతనాలు బయటపెట్టాడు. కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెం గ్రామానికి చెందిన గిరుతూరి విశ్వనాథం పాత నేరస్తుడు. కాకినాడ టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఇతనిపై రౌడీ షీటు ఉంది. విశ్వనాథానికి శ్రమ లేకుండా డబ్బు సంపాదించేయాలనే దురాశ కలిగింది. నెమ్మదిగా వైద్య సేవల్లో ప్రాథమిక ప్రావీణ్యం సంపాదించాడు. ఆ పరిజ్ఞానంతో ఆర్‌ఎంపీ వైద్యుడిని అంటూ స్థానిక రోగుల ఇళ్లకు వెళ్లి సేవలందించేవాడు. గ్రామాల్లో సంచరించి నిరక్షరాస్యులైన, ఇంట్లో ఏ తోడూ లేకుండా ఉండే వృద్ధుల్ని లక్ష్యంగా ఎంచుకున్నాడు. ఇంజెక్షన్ చేయాలని ఒంటిపై ఉన్న బంగారం తీసి పక్కన పెట్టమనేవాడు. వారు ఎందుకని ప్రశ్నిస్తే ఈ రకం మందు వల్ల ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశం ఉందంటూ నమ్మబలికి భయపెట్టేవాడు. పక్కన పెట్టిన బంగారాన్ని వారి కళ్లముందే దర్జాగా ఎత్తుకెళ్లేవాడు. అరిస్తే చంపేస్తానని బెదిరించి అక్కడి నుంచి ఉడాయించేవాడు. అలా కేవలం మూడు నెలల వ్యవధిలో ఐదు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎనిమిది మంది వృద్ధుల నుంచి బంగారాన్ని గుంజుకున్నాడు. ఈ దొంగతనాల్లో దోచేసిన మొత్తం బంగారం బరువు 164 గ్రాములు, బంగారంతో పాటు నిందితుడి నుంచి రూ.30 వేల నగదు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు.

**ఇదీ నేరాల చిట్టా...**

గతంలో విశ్వనాథం జిల్లాలో పలు చోట్ల వరుస దొంగతనాలకు పాల్పడ్డాడు. కోరంగి, ద్రాక్షారామం, యు.కొత్తపల్లి, సామర్లకోట, పెదపూడి పీఎస్‌ల పరిధిలో మొత్తం ఎనిమిది దొంగతనాలు చేశాడు. ఈ నెల 18వ తేదీన రామేశ్వరం రైల్వే గేటు సమీపంలో పోలీసులు సాధారణ తనిఖీలు చేస్తుండగా పెదపూడి నుంచి కాకినాడకు తన ద్విచక్ర వాహనంపై వస్తున్న విశ్వనాథం కంగారుపడి వెనక్కి వెళ్లిపోతుండగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. విచారించగా వరుస నేరాలకు పాల్పడ్డాడని ఒప్పుకున్నాడు. ఆ సొత్తును మరో ఐదుగురు వ్యక్తులకు విక్రయించాడని నిర్ధారించుకొని నిందితుడి నుంచి బంగారం కొనుగోలు చేసిన సాదే అరుణకుమార్(ఏలేశ్వరం), దారూరి షాలెమ్ రాజు(కాకినాడ రేచర్లపేట), ఆర్.షమీనా సుల్తానా(బెంగళూరు), గురజారపు మణికంఠ(సర్పవరం), ఎలుగుబంటి రాణి(కాకినాడ)లను అరెస్టు చేశామని ఎస్పీ తెలిపారు. వీరంతా వివిధ గోల్డ్ ఫైనాన్స్ సంస్థల్లో పనిచేస్తున్నారు. వీరిలో కొందరికి విశ్వనాథం తాను దొంగిలించిన బంగారాన్ని విక్రయించగా, మరికొందరి వద్ద తాకట్టు పెట్టాడు. ఈ నేరంలో నిందితుడితో పాటు అతడి నుంచి కొనుగోలు చేసిన వ్యక్తుల వివరాలను సేకరించి అదుపులోకి తీసుకోవడంలో కీలకంగా వ్యవహరించిన కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాస్, పెదపూడి ఎస్ఐ వాసు బృందాన్ని ఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించారు.

## విస్తృతంగా వైద్య సేవలు

- రూ. 2.60 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం
- విర్డ్ ట్రస్టు చైర్మన్ ఎస్వీ సుధాకరరావు వెల్లడి


ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న చైర్మన్ సుధాకరరావు తదితరులు

ద్వారకాతిరుమల: దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న శ్రీ వేంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ అండ్ రిహాబిలిటేషన్ ఫర్‌ద డిజేబుల్డ్ (విర్డ్) ఆస్పత్రి సేవలను మరింత విస్తృత పరుస్తున్నట్టు ఆస్పత్రి ట్రస్టు చైర్మన్ ఎస్వీ సుధాకరరావు తెలిపారు. ఆస్పత్రి మొదటి అంతస్తులో అవంతి ఫీడ్స్ కంపెనీ అధినేత ఎ.ఇంద్రకుమార్ విరాళం రూ.2 కోట్లతో నూతనంగా నిర్మించిన ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్‌ను, దేవీ సీ ఫుడ్స్ ఎండీ పి.బ్రహ్మానందం విరాళం రూ.50 లక్షలతో నిర్మించిన జనరల్ వార్డును, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ నిధులు రూ.10 లక్షలతో సమకూర్చిన పేషెంట్ లిఫ్టును గురువారం ప్రారంభించారు. వీటిని ఆస్పత్రి ట్రస్ట్ చైర్మన్ సుధాకరరావు, సిఫీ సాఫ్ట్‌వేర్ కంపెనీ చైర్మన్ వేగేశ్న అనంతకోటి రాజుల పర్యవేక్షణలో పద్మశ్రీ అవార్డు గ్రహీత, సిఫీ కంపెనీ డైరెక్టర్ టి.హనుమంత్ చౌదరి చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం పలువురు దివ్యాంగులకు నామమాత్రపు రుసుముతో కృత్రిమ అవయవాలను వారు అందించారు. ఆ తరువాత అనంతకోటి రాజు ఆధ్వర్యంలో సిఫీ కంపెనీ పాలకవర్గ సమావేశం జరిగింది. అనంతరం జరిగిన కార్యక్రమంలో విర్డ్ ట్రస్ట్ చైర్మన్ సుధాకరరావు మాట్లాడుతూ సేవే లక్ష్యంగా నామమాత్రపు రుసుముతో రోగులకు అత్యాధునిక వైద్య సేవలను అందిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆస్పత్రి ట్రస్ట్ సభ్యులు వి.నారాయణమూర్తి, ఐవీఆర్ సుధాకరరావు, ఎం.గుప్త, చెలికాని రాజబాబు, ఆర్.విశ్వనాథరాజు పాల్గొన్నారు.

## రీజనల్ పరిధిలో రూ.7,250 కోట్ల వ్యాపారం


విలేకరులతో మాట్లాడుతున్న రీజనల్ హెడ్ విజయరాజు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): బ్యాంక్ ఆఫ్ బరోడా రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయ పరిధిలో రూ.7,250 కోట్ల వ్యాపారం జరుగుతోందని రీజనల్ హెడ్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కె.విజయరాజు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఇన్నీసుపేటలోని బ్యాంక్‌ఆఫ్‌బరోడా ప్రాంతీయ కార్యాలయంలో బ్యాంకు 116 ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జరిగిన వేడుకలను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని, కంటి, దంత, జనరల్ ఉచిత వైద్యశిబిరాలను ప్రారంభించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజనల్ పరిధిలో 49 బ్రాంచిలు ఉన్నాయన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎక్కువగా స్వయం సహాయక సంఘాలకు రుణాలు, గోల్డులోన్లు, వ్యవసాయదారులకు ట్రాక్టర్ల లోన్లు, పౌల్ట్రీలోన్లు, రూరల్ ప్రాంతాల్లో గొడౌన్ల లోన్లు, హౌసింగ్, కార్లు, ఎడ్యుకేషన్, వ్యక్తిగత అవసరాలకు రుణాలు మంజూరు చేస్తామన్నారు. రాజమహేంద్రవరం మెయిన్‌బ్రాంచి ఎంఎస్ఎంఈ సెల్ ఆన్‌లైన్‌లో ప్రారంభమైందన్నారు. ఏకేసీ కళాశాల రోడ్డులో వాక్‌థాన్‌తో పాటు మొక్కలు నాటడం, అనాథశ్రమానికి ఆహార పదార్థాలను సమకూర్చడం సీఎస్ఆర్ యాక్టివిటి కింద చేస్తున్నామని తెలిపారు. డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఫోర్జరీ పత్రాలతో రుణం పొందిన ఇద్దరికి జైలు

పెదపూడి: చనిపోయిన ఒక వ్యక్తి పేరున ఫోర్జరీ సంతకంతో బ్యాంక్‌లో స్థలం డాక్యుమెంట్లు తాకట్టు పెట్టి రుణం తీసుకున్న ఇద్దరికి న్యాయమూర్తి జైలు శిక్ష, జరిమానా విధించారు. పెదపూడి ఎస్సై పి.వాసు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జి.మామిడాడలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో ఫోర్జరీ డాక్యుమెంట్లు తాకట్టు పెట్టి 2010లో అక్టోబర్ 18న రూ.కోటి10 లక్షల రుణం నిందితులు పొందారు. కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేటకు చెందిన ముప్పిడి గాంధీరెడ్డి, బిక్కవోలు గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యేశ్వర ట్రేడర్స్ మేనేజింగ్ పార్టనర్లు ముప్పిడి ప్రసాద్‌రెడ్డి, మానుకొండ సత్య ప్రసన్న, విశాఖపట్నం జిల్లా పాయికరావుపేటకు చెందిన గుడిమెట్ల రామకృష్ణారెడ్డి, గుడిమెట్ల వెంకటత్రిమూర్తులు, పిఠాపురంనకు చెందిన కొత్తా జగదీష్, అయినవిల్లి గ్రామానికి చెందిన విల్లా సతీష్ ఈ మోసానికి పాల్పడ్డారు. బ్రాంచ్ మేనేజర్ ద్వారంపూడి వెంకటకృష్ణారెడ్డి ఫిర్యాదు చేయగా అప్పటి ఏఎస్ఐ అప్పారావు కేసు నమోదు చేశారు. తరువాత ఎస్ఐలు సూర్యనారాయణ, మహేష్ దర్యాప్తు చేపట్టారు. ముప్పిడి గాంధీరెడ్డి, మానుకొండ సత్య ప్రసన్నపై నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ కాకినాడలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ కమ్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.లీలాశ్యామ్‌సుందరి తీర్పు ప్రకటించారన్నారు. నిందితులు ముప్పిడి ప్రసాద్‌రెడ్డి, గుడిమెట్ల రామకృష్ణారెడ్డి, గుడిమెట్ల వెంకట త్రిమూర్తులు చనిపోగా, కొత్తా జగదీష్, విల్లా సతీష్‌లపై నేరం రుజువు కాలేదన్నారు.

## పట్టునోటు!


జర్మనీ దేశం రూపొందించిన నోటు (రెండు వైపులా)

అమలాపురం టౌన్: జర్మనీ దేశం వందేళ్ల కిందటే వినూత్నంగా పట్టు దారాలతో 25 మార్కుల ముఖ విలువతో కరెన్సీ నోటును ముద్రించింది. ప్రపంచంలోనే అరుదైన ఈ నోటును అమలాపురం భూపయ్య అగ్రహారానికి చెందిన పుత్సా కృష్ణ కామేశ్వర్ ప్రత్యేక ఆర్డర్‌పై జర్మనీ నుంచి రప్పించారు. సాధారణంగా ఏ దేశపు కరెన్సీ నోట్లయినా కాగితంతోనే ముద్రితమవుతాయి. సాంకేతిక విప్లవం కారణంగా మూడు దశాబ్దాలుగా అనేక దేశాలు ప్లాస్టిక్ నోట్లను ముద్రిస్తున్నాయి. ఒక శతాబ్దం కిందటే అంటే 1921లో జర్మనీ దేశం ప్రపంచంలోనే తొలిసారిగా పట్టు దారాలతో కరెన్సీ నోటును ముద్రించింది. ఈ కరెన్సీ నోటుపై ముందు భాగంలో దివ్యాంగులుగా ఉన్న కొందరు వ్యక్తులు ఒక కొలనులోకి వెళ్లి స్నానం చేసి తమ అంగవైకల్యాన్ని పోగొట్టుకున్నట్లుగా ముద్రించారు. రెండో వైపు ఒక కర్మాగారాన్ని ముద్రించారు.